పరకే బంగారమాయెనె..!

- ఎండుగడ్డికి యమ గిరాకీ
- వేధిస్తున్న పశుగ్రాసం కొరత
- అందుబాటులో లేక ధరకు రెక్కలు
- రూ.16 వేల నుంచి రూ.20 వేలు పలుకుతున్న ట్రాక్టర్ గడ్డి


ఎండుగడ్డి మేతను తింటున్న పశువులు

రామచంద్రపురం రూరల్: పాడి పంటలకు అయువు పట్టు పల్లె సీమలు. అలాంటి పల్లెసీమల్లోనే పాడి పశువుల పోషణకు అవసరమైన మేత కరువైంది. ఈ క్రమంలోనే పాడి పరిశ్రమ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వ్యవసాయం యాంత్రీకరణ పుణ్యమా అని ఎండుగడ్డికి ఎక్కడ లేని కొరత వచ్చి పడింది. దీంతో గడ్డిపరకను కూడా బంగారంలా భావించాల్సిన పరిస్థితి పశు పోషకులకు ఏర్పడింది. ఎండుగడ్డి ధర రోజురోజుకూ పెరుగుతుండడం పశువుల పెంపకందారులకు భారంగా పరిణమిస్తోంది.

వరి కోతల్లో యంత్రాల వినియోగం పెరగడంతో ఎండుగడ్డి కోసం పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. గతంలో వరిని కూలీలు కోసేవారు. కుప్పనూర్చి ఎండుగడ్డిని జాగ్రత్త పరుచుకుని పశువులకు వేసేవారు. ఇప్పుడు యంత్రాల ద్వారా పంట కోయడంతో అది పశువులకు పనికి రాకుండా పోతోంది. దీంతో అక్కడక్కడా దొరికే ఎండుగడ్డిని పాడి రైతులు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. ఒకప్పుడు రైతులు ఎండుగడ్డిని కారుచౌకగా పాడి రైతులకు ఇచ్చేవారు. ప్రస్తుతం ఎకరా చేలో వచ్చే ఎండు గడ్డి రూ.8 వేల నుంచి రూ.10 వేలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ట్రాక్టర్ గడ్డి ధర రూ.16 వేల నుంచి రూ.20 వేలు పలుకుతోంది.

ఎండు గడ్డి కొరతకు మిచాంగ్ ఆజ్యం

అసలే యంత్రాల కోత పుణ్యమా అని పాడి రైతులు ఎదుర్కొంటున్న ఎండు గడ్డి కొరతకు.. మిచాంగ్ తుపాను మరింత ఆజ్యం పోసినట్టయింది. యంత్రాలు కోసిన తర్వాత మిగిలిన వరి గడ్డిని సేకరించి చుట్టలు చుట్టే యంత్రం రావడంతో సమస్య కొంత వరకు తగ్గినా, తుపాను ప్రభావంతో పంట చేలు నీట మునగడంతో చాలామంది రైతులు మిగిలిన వరి గడ్డిని సేకరించలేకపోయారు.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో పాడి పశువుల గణాంకాలు

మండలం	ఆవులు	గేదెలు
రామచంద్రపురం	2,159	7,288
కె.గంగవరం	4,289	8,846
కాజులూరు	4,830	8,332
మండపేట	5,842	7,560
రాయవరం	3,980	5,230
కపిలేశ్వరపురం	3,510	4,870


రామచంద్రపురం మండలం తోటపేటలో యంత్రం సాయంతో చుట్టలు చుట్టిన వరిగడ్డి

ఎండు గడ్డి దొరకడం లేదు



ప్రస్తుతం ఎండుగడ్డి చాలా గిరాకీగా ఉంది. ఎండుగడ్డి వరిచేల వద్ద కొనుగోలు చేస్తే ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేలు అవుతోంది. దీనికితోడు రవాణా ఖర్చులతో కలిపితే మరో రూ.మూడు వేలు అదనం. దీంతో పశు పోషణ భారమవుతోంది.

– మేడిశెట్టి నాగరాజు, పాడి రైతు, వెల్ల, రామచంద్రపురం మండలం

మున్ముందు దొరకదేమో!



ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే భవిష్యత్తులో ఎండుగడ్డికి మరింత కొరత ఏర్పడేలా ఉంది. అందుకే ధర ఎక్కువైనా ఇప్పుడే ఎండుగడ్డిని కొనుక్కుని నిల్వ చేసుకుంటున్నాం. ఎండుగడ్డి ధర పెరగడంతో పాడి పరిశ్రమ చేయాలా, వద్దా అనేలా ఇబ్బందులు కలుగుతున్నాయి.

– నులుకుర్తి వెంకటరమణ, పాడి రైతు, అన్నాయిపేట, రామచంద్రపురం మండలం

ఎండుగడ్డితో వెన్నశాతం పెరుగుతుంది



పశువులకు పచ్చగడ్డితో పాటు ఎండుగడ్డి మేత చాలా అవసరం. ఎండుగడ్డితో పాలలో వెన్నశాతం పెరుగుతుంది. చూడి పశువులకు రోజుకు 5 కేజీలకు మించి ఎండుగడ్డి పెట్టకూడదు. పాలిచ్చే పశువులకు మాత్రం రోజుకు 10 నుంచి 15 కేజీల ఎండుగడ్డి పెట్టవచ్చు. పచ్చిమేత 60 శాతం పెడితే, ఎండుగడ్డి 40 శాతం అందించాల్సి ఉంటుంది. వరి చేలు యంత్రాలతో కోసినా మిగిలిన గడ్డిని చుట్టి మోపులుగా చేసే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ మేడిశెట్టి అర్జున్, పశు వైద్యాధికారి, రామచంద్రపురం మండలం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- పలు గ్రామాల్లో కార్తిక వన సమారాధనలు
- ఆటల పోటీల నిర్వహణ, బహుమతుల పంపిణీ

రాయవరం: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని రాయవరం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వన సమారాధన కార్యక్రమాలు ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగాయి. వివిధ సామాజిక వర్గాలు, స్నేహితులు నిర్వహించిన వన సమారాధన కార్యక్రమాల్లో పెద్దఎత్తున ఆయా వర్గాల వారు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. సుమారు ఆరు వేల మంది వన సమారాధనలో పాల్గొన్నారు. స్థానిక శెట్టిబలిజ సామాజిక వర్గం వన సమారాధనలో సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు, మహిళలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్, బాల్స్ విత్ వాటర్ గ్లాసెస్, లెమన్ స్పూన్ తదితర ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం నేతలు బొడ్డు శ్రీను, కోట బాబూరావు, కేతా ఏడుకొండలు, కురుపూడి సూర్యనారాయణ, కాలా శ్రీను, బొడ్డు మంగయ్యబ్బు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వన సమారాధనలు

రామచంద్రపురం: కార్తిక మాసం ఆఖరి ఆదివారం కావటంతో పట్టణంలోని వివిధ సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధనలు జరిగాయి. పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో కాపు సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనను ఘనంగా సత్కరించారు. పట్టణ కాపు సంఘం అధ్యక్షుడు నారపురెడ్డి బలరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమారాధనకు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, నాయకులు చిక్కాల దొరబాబు, నాయకులు తొగరు మూర్తి, కంచుమర్తి బాబూరావు, పెంటపాటి శ్రీను, అంకం శ్రీనివాసు, బావాల భద్రరావు, అరిగెల నాగేశ్వరరావు, కాపు సంఘం నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్‌వీఆర్ ఫంక్షన్ హాల్ వెనుక లేవుట్‌లో నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం కార్తిక వన సమారాధన జరిగింది. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సత్కరిస్తున్న కాపు సంఘం నేతలు

బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా చేయూత

సంస్థ చైర్మన్ పేరి కామేశ్వరరావు

కపిలేశ్వరపురం (మండపేట): బ్రాహ్మణ కార్పొరేషన్ పేద, మధ్యతరగతి బ్రాహ్మణులకు చేయూత అందించేందుకు కృషి చేస్తున్నట్టు రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణ బ్రాహ్మణ సేవా సంఘం, శ్రీరామ మందిర్ బ్రాహ్మణ సత్రం సంయుక్తాధ్వర్యంలో సీతారామ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన కార్తిక వన సమారాధనకు కామేశ్వరరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బ్రాహ్మణ సామాజిక వర్గం అభ్యున్నతికి కృషి చేస్తున్న తీరును వివరించారు. బ్రాహ్మణుల స్థితిగతులపై శివకోటి శేష సుబ్రహ్మణ్యం, ఏడిద సూర్యనారాయణ, దంటు సూర్య నారాయణ మూర్తి, పెడపర్తి బ్రహ్మాజీ, సుసర్ల సూర్యనారాయణ శాస్త్రి, జీఎస్ భగవాన్ మాట్లాడారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యుడు కందర్ప హనుమాన్, సినీ నటుడు జిత్ మోహన్ మిత్ర, బ్రాహ్మణ ప్రముఖులు కొత్తూరు శ్రీనివాసు, రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి బుద్ధవరపు శ్రీనివాస కల్యాణచక్రవర్తి, జిల్లా రైసుమిల్లుల యాజమానుల సంఘ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.సాయికుమార్ బాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.


మండపేటలో కామేశ్వరరావును సత్కరిస్తున్న ప్రముఖులు

సాగర తీరంలో పర్యాటకుల సందడి


ఓడలరేవు సాగర తీరానికి పోటెత్తిన సందర్శకులు

అల్లవరం: కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో ఓడలరేవు సాగర తీరంలో పర్యాటకులు సందడి చేశారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో పోలీసుల ఆంక్షలతో గత పది రోజులుగా పర్యాటకులు లేక తీరం బోసిపోయింది. మంగళవారంతో కార్తిక మాసం ముగుస్తుండడంతో తీరంలో పుణ్యస్నానాలు ఆచరించడానికి దూర ప్రాంతాల నుంచి వందలాది మంది తరలిరావడంతో ఉదయం నుంచి తీరమంతా సందర్శకులతో నిండిపోయింది. పిల్లలు, యువతీయువకులు సముద్రంలో స్నానాలు చేయడానికి పోటీపడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తీరం పక్కనే ఉన్న సరుగుడు తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి ఆత్మీయతను చాటుకున్నారు. సముద్ర స్నానాలు చేసే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గస్తీ నిర్వహించారు.

నష్ట నివారణపై శ్రద్ధ అవసరం

కాజులూరు: భారీ వర్షాలకు నష్టపోయిన వరి పంటను సంరక్షించుకోవడంలో రైతులు తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లపాలెం, బంధనపూడి, చేదువాడ, కాజులూరు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి, నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది తొలకరిలో 18,070 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, వర్షాల నాటికి సుమారు 16 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయన్నారు. మాసూళ్లు నిర్వహించిన పొలాల్లో అధిక శాతం పనల రూపంలో, ధాన్యం రాశుల రూపేణా ఉండిపోయాయన్నారు. సుమారు 1800 ఎకరాల్లో పంట కోత కోయాల్సి ఉందన్నారు. వర్షాలకు పడిపోయి, నేలనంటిన పంట గింజ మొలకలు రాకుండా ఉండేందుకు, వరి పంటపై 10 లీటర్ల నీటికి 100 గ్రాముల ఉప్పును కలిపి గింజలపై చల్లాలన్నారు.

పొలాల్లోని ముంపు నీరు బయటకుపోయేందుకు చిన్న బోదెలు ఏర్పాటు చేయాలన్నారు. పనల రూపంలో, ధాన్యం రూపంలో ఉన్న పంటను ఒడ్డుకు చేర్చి ఆరబెట్టుకోవాలన్నారు. గొల్లపాలెం వ్యవసాయాభివృద్ధి కమిటీ చైర్మన్ తాడి భువనేశ్వరీదేవి, వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు టేకుమూడి దుర్గారావు, అనసూరి నరసింహమూర్తి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రేమాభిమానాల వేదిక వైఎస్సార్ సీపీ

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కార్తిక వన సమారాధనకు విశేష స్పందన
- మూడు మండలాల నుంచి జన సందోహం

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ ప్రేమాభిమానాల వేదిక అని, మండపేటలో పార్టీ ఆత్మీయుల కార్తిక వన సమారాధనకు తరలివచ్చిన జన సందోహమే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట పట్టణం గొల్లపుంత రోడ్డులోని సంకా సుధాకర్ లేఅవుట్‌లో ఆదివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఆత్మీయుల కార్తిక వన సమారాధన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మండపేట పట్టణం, రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన ఆయన అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరంగంలా తరలివచ్చారు.

అభిమానులతో గడపడం అదృష్టం : ఎమ్మెల్సీ తోట

ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ తనకు బలం ప్రజలేనని, ఎవరు కష్టాల్లో ఉన్నా తన వద్దకు వచ్చి సాయమడగడం, తన శక్తిమేరకు సాయం చేయడం భగవంతుడిచ్చిన అవకాశంగా భావిస్తానన్నారు. తాను ఎక్కడున్నా ప్రజలు, అభిమానులతో గడపడం ఇష్టమన్నారు. మూడు మండలాల అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో ఒకరోజు సందడిగా గడపాలన్న కోరిక కార్తిక వన సమారాధనతో నెరవేరిందన్నారు.


మండపేట కార్తిక వన సమారాధనలో ఎంపీ బోసు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఇతర ప్రముఖులు

ఐక్యతకు ప్రతీక

ఎమ్మెల్సీ తోట పిలుపుతో మూడు మండలాల్లోని పార్టీ కార్యకర్తలు కార్తిక వన సమారాధన ఆహ్వాన పత్రాలను ప్రజలకు అందజేశారు. వేదిక వద్దకు వచ్చిన ప్రజలను ప్రేమతో ఆహ్వానిస్తూ అన్న ప్రసాదాలను వడ్డించారు. జనం తాకిడికి అనుగుణంగా ఫుడ్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. జబర్దస్త్ కళాకారులు ప్రదర్శించిన హాస్య సందేశ కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కళాకారుల మిమిక్రీ, జోక్స్, నృత్య ప్రదర్శనలతో వన సమారాధన వేదిక సందడిగా మారింది.

ప్రముఖుల ఆత్మీయ పలకరింపు

ఎమ్మెల్సీ తోట ఆహ్వానం మేరకు జిల్లా నలుమూలల నుంచి కార్తిక వన సమారాధన కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జిల్లా ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయేలు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, పార్టీ రాష్ట్ర నాయకులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాజుబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ కాళ్లకూరి నాగబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, మూడు మండలాల పార్టీ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, శీలం గోవింద్, తమలంపూడి గంగాధర రెడ్డి, రేవు శ్రీను, ఎమ్మెల్సీ తోట తనయుడు పృథ్వీరాజ్, పిల్లి సూర్యప్రకాష్ కార్యక్రమంలో సందడి చేశారు. ప్రముఖులు మాట్లాడుతూ ప్రజలతో మమేకమవ్వడం ద్వారా ఎమ్మెల్సీ తోట పేద, మధ్య తరగతి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారని పేర్కొన్నారు.


కార్తిక వన సమారాధనకు హాజరైన జన సందోహం

కుటుంబ సమేతంగా..

ఆదివారం సెలవు దినం కావడంతో వైఎస్సార్ సీపీ అభిమానులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. విశాలమైన వేదిక ప్రాంగణంలో రుచికరమైన అన్న ప్రసాదంతో పాటు ఆట పాటల వేదిక, రంగులరాట్నం వంటి ఆట వస్తువులు ఉండటంతో చిన్నారులు, పెద్దలు సందడి చేశారు. మూడు మండలాల్లోని ఇటుకల బట్టీ శ్రామికులు, మండపేట పట్టణంలోని పరిశ్రమల్లోని కార్మికులు, కోళ్లఫారాల్లోని శ్రామికులు, మహిళా శ్రామికులు అత్యధికంగా తరలివచ్చారు. పట్టణ, రూరల్, కపిలేశ్వరపురం మండలాల పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

ముగిసిన మహా కుంభాభిషేక పూజలు

కపిలేశ్వరపురం: వల్లూరులో ద్వాదశ పుణ్య నదీ జలాలతో నిర్వహించిన మహా కుంభాభిషేక పూజలు శనివారంతో ముగిశాయి. గ్రామంలోని దేవతామూర్తుల ఆలయాల్లో పుణ్యనదీ జలాలతో అభిషేకం చేశారు. కొద్ది రోజులుగా సాగిన పూజా కార్యక్రమాల్లో 108 పుణ్య దంపతులు పీటలపై కూర్చుని పూజాక్రతువులను చేశారు. గ్రామంతో పాటు సమీప గ్రామాల భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసిన భక్తులకు నిర్వాహక ప్రముఖులు వేగుళ్ల లీలా కృష్ణ, వల్లూరి వీరబాబు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు.

అంగరలో ధన్వంతరి హోమం


అంగరలో ధన్వంతరి హోమం చేస్తున్న పండితులు

కపిలేశ్వరపురం: కార్తిక మాసం సందర్భంగా అంగరలోని గోశాల అనంత పద్మనాభస్వామి ఆలయంలో ఆదివారం కార్తిక దామోద వ్రత పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు సంపర వాసుదేవనాగ సాయి సుమంత్ ఆధ్వర్యంలో నెల రోజులుగా పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ధన్వంతరి జయంతి సందర్భంగా విశ్వక్షేణ పూజ, పుణ్యాహవచనం, కుంభ పూజ, పంచామృతాభిషేకం, ధన్వంతరి హోమం, మహాపూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్ప పూజలను నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు దొమ్మేటి రాజు ఆధ్వర్యంలోని భజన భక్త బృంద సభ్యుల గీతాలు అలరించాయి.

భీమేశ్వర స్వామిని దర్శించుకున్న చంద్రశేఖర్


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో చంద్రశేఖర్, ఆయన కుటుంబ సభ్యులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని ఆదివారం ఏపీ సమగ్ర శిక్ష ఫైనాన్స్ విభాగం డైరెక్టర్ ఎస్.చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వర రావు ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం నంది మండపంలో పండితుల వేదాశీర్వచనం అందుకున్నారు. ఆయన వెంట జిల్లా ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ


మహిళకు గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న నాయకులు

కె.గంగవరం: ఉజ్వల యోజన కింద లబ్ధిదారులకు ఆదివారం బాలాంత్రంలో గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇళ్ల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ తదితరులు పాల్గొని 52 మందికి ఉచితంగా గ్యాస్‌స్టౌ, సిలిండర్లను అందించారు. సర్పంచ్ చాగంటి సాంబశివరావు, ఎంపీటీసీ కొప్పిన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి కృత్రిమ చెయ్యి అమరిక


మంగళగిరిలో అప్పారావుకు కృత్రిమ చెయ్యిని అమర్చిన బృందం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని తాపేశ్వరం గ్రామానికి చెందిన యువకుడు ఆకుల అప్పారావుకు విజయవాడలోని మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శిబిరంలో కృత్రిమ చెయ్యి అమర్చారు. చిన్నప్పుడు జరిగిన ప్రమాదంలో అప్పారావు ఎడమ చెయ్యి దెబ్బతింది. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అప్పారావు సమస్యపై మానవత్వంతో దృష్టి సారించిన ఉపాధ్యాయుడు కోటిపల్లి రాంబాబు రోటరీ క్లబ్‌ను సంప్రదించారు. మంగళగిరిలో అప్పారావుకు చెయ్యిని అమర్చి, వినియోగించుకునే పద్ధతిపై అవగాహన కల్పించారు. రూ.35 వేల విలువైన కృత్రిమ చెయ్యిని ఉచితంగా పొందడంపై క్లబ్ ప్రతినిధులకు, ఉపాధ్యాయుడు రాంబాబుకు అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు


తాళ్లరేవు-కాజులూరు ప్రధాన రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్‌లు

కాజులూరు: వైఎస్సార్ సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఒంటితాడి సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ, శీల సర్పంచ్ కోమలి వెంకటరమణ అన్నారు. ఆదివారం ఆయా గ్రామాల మీదుగా జరుగుతున్న తాళ్లరేవు-కాజులూరు ప్రధాన రహదారి నిర్మాణ పనులను ఇద్దరు సర్పంచ్‌లు సందర్శించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన, కరోనా విపత్కర పరిస్థితులతో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నప్పటికీ, ప్రజల అవసరాలకు అనుగుణంగా సీఎం భారీఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేశారని, అభివృద్ధి పనులు వేగవంతం చేశారని వివరించారు. దశాబ్దాల నుంచి శిథిలావస్థలో ఉన్న తాళ్లరేవు-కాజులూరు ప్రధాన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు వారు అభినందనలు తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


ద్రాక్షారామలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న మధుసూదనరావు

రామచంద్రపురం రూరల్: విశాఖపట్నానికి చెందిన సత్యసాయి ట్రస్ట్ ఫర్ సోషల్ వెల్ఫేర్ 14వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ద్రాక్షారామ భీమేశ్వరస్వామి అతిథిగృహం వద్ద 500 మంది పేదలైన వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు సుమారు రూ.3 లక్షల విలువైన దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ శివకోటి మధుసూదనరావు 14 ఏళ్లుగా ఏటా క్రమంతప్పకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఇవటూరి రవికిరణ్, విస్సాప్రగడ కృష్ణ మూర్తి, మాజీ సర్పంచ్ యాట్ల చినఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కార్తిక దీపారాధన మహోత్సవం

కాజులూరు: దుగ్గుదుర్రు పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తిక దీపారాధన మహోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకుడు, నిర్వాహక కమిటీ సభ్యుడు కడలి రాంపండు ఆధ్వర్యంలో పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి దీపాలంకరణ జరిగింది. పీఏసీఎస్ చైర్మన్ రేవుళ్ల చిట్టియ్యదొర, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ కార్యదర్శి మాత నూకరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో కోతుల బెడద


గొల్లపాలెం గ్రామ వీధుల్లో హల్‌చల్ చేస్తున్న కోతుల గుంపు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో కొన్ని రోజులుగా కోతులు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామ వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ, కొబ్బరి చెట్ల నుంచి కాయలు, పిందెలను తుంచి పారేస్తున్నాయి. ఇళ్లపై అవి పరుగులు తీస్తుండటంతో పెంకులు ఊడిపడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. చిన్నారులు, మహిళలు, ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. తాళ్లరేవు మండలం కోరంగి అభయారణ్యం సమీపంలో ఉండడం వల్ల అక్కడి నుంచి కోతుల గుంపులుగా మండలంలోని తణుకువాడ, శలపాక మీదుగా గ్రామానికి చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కోతుల సంచారాన్ని నిరోధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాట్రేనికోన: రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెయ్యేరు గ్రామానికి చెందిన బుడితి ఆనందరావు(65) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కాట్రేనికోన ఎస్‌ఐ బి.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 3న చెయ్యేరులో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆనందరావును కుటుంబసభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆనందరావు కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు.

ఆలయంలో చోరీ

ముమ్మిడివరం: మండలంలోని కొత్తలంక ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. శనివారం అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించి డిబ్బీని ఎత్తుకుపోయారు. పక్కనే ఉన్న కొబ్బరితోటలో డిబ్బీని పగులగొట్టి రూ.5 వేలు నగదు అపహరించుకుపోయారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యుడు కె.సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం ట్రైనీ ఎస్‌ఐ వి.విష్ణు స్వరూప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.